

హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో ముగ్గులు వేసి, ఓం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పాలకుర్తి: క్షీరగిరి క్షేత్రంపై అఖండ జ్యోతి


గణపురం: 11 వేల దీపాల కాంతుల్లో కోటగుళ్లు


వరంగల్: భద్రకాళీ అలయంలో జ్వాలా తోరణం వెలిగించిన అర్చకులు, పాల్గొన్న భక్తులు




గణపురం: ప్రత్యేక అలంకరణలో కోటగుళ్ల గణపేశ్వరుడు


కాళేశ్వరం: గోదావరిలో దీపాలను వదులుతున్న భక్తులు

# కార్తిక వైభవం

## పౌర్ణమి వేళ ఆలయాలు భక్తజన సంద్రం

- శివకేశవులకు ప్రత్యేక పూజలు, దీపాల వెలుగులు
- కనులపండువగా జ్వాలాతోరణం, అఖండ జ్యోతి



వెంకటాపూర్: శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు


హనుమకొండ: సిద్ధేశ్వరాలయంలో దీపం వెలిగిస్తున్న మహిళ

కాళేశ్వరం, నవంబర్ 15 : పవిత్ర కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని శుక్రవారం వైభవంగా జరుపుకొన్నారు. వేకువజాము నుంచే భక్తజనంతో ఆలయాలన్నీ పోటెత్తగా, సాయంత్రం వేళ ప్రముఖ క్షేత్రాలతో పాటు ఊరూవాడలు కార్తిక దీపాల వెలుగులతో శోభిల్లాయి. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం, భద్రకాళీ, ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం, పాలకుర్తిలోని సోమేశ్వరాలయం, కాళేశ్వర-ముక్తీశ్వరాలయం సహా అన్ని ఆలయాల్లో ఉదయం నుంచే దర్శనం కోసం బారులు తీరారు. రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించగా అంతటా సందడి కనిపించింది. ఈ సందర్భంగా ఉసిరి, తులసి చెట్ల వద్ద దీపాలు వెలిగించారు. అలాగే పలుచోట్ల రాత్రి వేళ లక్ష దీపోత్సవం, జ్వాలాతోరణం, అఖండ జ్యోతి వెలిగించగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శించుకన్నారు. అలా గే కాళేశ్వరంలోని కాళేశ్వర-ముక్తీశ్వర స్వామి వారి ఆలయం పౌర్ణమి సందర్భంగా భక్తులతో పోటెత్తింది. ఉమ్మడి వరంగల్ నుంచే గాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో త్రివేణి సంగమం పులకించింది. గోదావరి పుష్కరఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు చేసి నదీమాతకు దీపాలు వదిలి, సైకత లింగాలను పూజించారు. కార్తిక మాసం పౌర్ణమి రోజున ఆలయానికి ఒకే రోజు రూ.9 లక్షల ఆదాయం సమకూరింది. ఉదయం 5గంటలకు ఐదు కలశాల్లో నదీ జలాలు తీసుకొచ్చి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, మధ్యాహ్నం 12 గంటలకు శివకల్యాణం జరిపించారు. అలాగే సత్యనారాయణ వ్రతాలతో పాటు ఆలయ ఆవరణలోని ఉసిరి, మారేడు చెట్లకు మహిళలు లక్ష వత్తులు, లక్ష ముగ్గులతో దీపాలంకరణ చేశారు. సాయంత్రం నది మాతకు హారతి ఇచ్చారు.


ఏటూరునాగారం: జ్వాలా తోరణం నుంచి దాటుతున్న భక్తులు


వేయిస్తంభాల దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


వేయిస్తంభాల దేవాలయంలో సెల్ఫీ దిగుతున్న భక్తులు


హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా క్యూలో భక్తులు


కాళేశ్వరం: గోదావరి తీరంలో ఉన్న భక్తులు


హనుమకొండ వేయిస్తంభాల ఆలయంలో క్యూలో భక్తులు

# భక్తజన జాతర


- వైభవంగా కందికొండ, బుగులోని జాతరలు
- గోవింద నామస్మరణతో మార్మోగిన కొండలు
- దర్శనం కోసం వేలాదిగా తరలివచ్చిన భక్తులు


రేగొండ: జాతరలో ఎడ్ల బండ్ల ప్రదక్షిణలు


కురవి: కందగిరి పర్వతంపై లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయం వద్దకు తరలివస్తున్న భక్తులు

రేగొండ/కురవి, నవంబర్ 15 : కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని రేగొండ మండలంలోని తిరుమలగిరి పాండవుల గుట్టలపై శుక్రవారం బుగులోని జాతర వైభవంగా ప్రారంభమైంది. జిల్లాతో పా టు ఇతర ప్రాంతాల నుంచి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మూడు రోజుల పాటు ఇక్కడే ఉంటూ ఉత్సవాలను తిలకిస్తారు. కోరిన కోర్కెలు తీర్చే వేంకటేశ్వరస్వామికి ఏనుగు, మేకలు, ప్రభబండ్లు తయారు చేసి మొక్కులు చెల్లించుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తున్నది. భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## కిటకిటలాడిన కందికొండ


కురవి: కందికొండ శివారులోని కందగిరి పర్వతంపై లక్ష్మీనర్సింహస్వామి శిఖరం వద్ద కిక్కిరిసిన భక్తులు

కురవి మండలంలోని కందికొండ శివారు గుట్టపై లక్ష్మీనర్సింహస్వామి జాతర శుక్రవారం కనులపండువగా జరిగింది. భక్తజనంతో కందగిరి క్షేత్రం కిటకిటలాడింది. అర్చకులు అర్చకులు శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణం వేదమంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించగా గోవింద నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. నడిచే దాటరి లేక పోయినా ఎత్తైన గుట్టలను అవలీలగా ఎక్కుతూ స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అలుపుసొలుపు లేకుండా భక్తులు స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం పొందారు.

# 'జుడా'గా జనగామ మున్సిపాలిటీ!

- అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- త్వరలో వెలువడనున్న ఉత్తర్వులు
- పురపాలక సంఘం పరిధిలో పలు గ్రామాల విలీనం
- తాజాగా ప్రతిపాదినలు కోరిన సర్కారు



జనగామ, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : జిల్లాకేంద్రంగా ఆవిర్భవించిన జనగామ ఇక అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(జుడా)గా అవతరించబోతున్నది. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జిల్లాకేంద్రాలుగా ఏర్పడిన పట్టణాలను అవసరమైన చోట ప్రణాళిక బద్ధమైన విస్తరణ, అభివృద్ధి, నాణ్యమైన పట్టణవాసం కల్పించేందుకు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ(యూడీఏ)లుగా ప్రకటించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 4,03,516 మంది ఉన్న జనగామ పురపాలక సంఘం 2024 అంచనా ప్రకారం 4,54,168 మందితో 1654.756 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో పట్టణం విస్తరించింది. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా 18 పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలకు సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం 12 మండలాలు, 283 గ్రామాలతో విస్తరించిన జనగామ జిల్లా ఉంది. జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల పరిధిలోని 58 గ్రామాలు ఇప్పటికే కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) పరిధిలో ఉండగా తాజాగా స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జనగామ జిల్లాకేంద్రానికి విజయవాడ(సూర్యాపేట క్రాస్‌రోడ్డు)-దుద్దెడ నేషనల్ హైవే, వరంగల్-హైదరాబాద్ ఎన్‌హెచ్-365 వంటి రెండు జాతీయ రహదారులు సికింద్రాబాద్-విజయవాడ, సికింద్రాబాద్-ఢిల్లీ మధ్య రైలు కనెక్టివిటీ ఉంది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వంటి నాలుగు రాష్ట్రాలను కలిపే కూడలిగా ఉండే జనగామ జిల్లాకు నలువైపులా సూర్యాపేట, భువనగిరి యాదాద్రి, సిద్దిపేట, వరంగల్, హనుమకొండ జిల్లాల సరిహ ద్దు కలిగి ఉంది. హైదరాబాద్‌కు 80 కిలో మీటర్ల పరిధితో ఉండడంతో మున్సిపాలిటీ సహా 225 గ్రామాలతో 'జుడా' ఏర్పాటుకు ప్రతిపాదించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో జిల్లాల పునర్విభజన తర్వాత పట్టణీకరణలో భాగంగా సమీప గ్రామాల విలీనం తర్వాతే స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్ ఎన్నికలకు వెళ్లాలనే ఉద్దేశంతో పంచాయతీల విలీనం, నగర పంచాయతీలకు స్థాయి పెంపు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటు అంశాలు 2017లో తెరపైకి వచ్చాయి. అయితే వివిధ సాంకేతిక, కోర్టు వివాదాల కారణాలతో వెనక్కి వెళ్లాయి. తాజాగా జిల్లాకేంద్రంతో పాటు పట్టణీకరణ ప్రభావం, విస్తరణకు అవకాశాలున్న గ్రామాలు, 2011, 2024 జనాభా అంచనా, ఏరియా వంటి వివరాలతో కూడిన ప్రతిపాదిత ప్రణాళికను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ద్వారా పంపిన నివేదికను ప్రభుత్వం ఆమోదించింది.

### పురపాలక విస్తరణకు అడుగులు

జనగామ మున్సిపాలిటీ విస్తరణలో భాగంగా స్థాయి పెంపు ప్రతిపాదనకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సెకండ్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న జనగామలో తొమ్మిది సమీప గ్రామాలను విలీనం చేయడం ద్వారా తొలుత గ్రేడ్-1గా రూపాంతరం చెందనున్నది. ప్రస్తుతం రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్‌కు మున్సిపాలిటీ స్థాయి రానున్నది. తద్వారా కొత్తగా ఏర్పడిన జనగామ జిల్లాలో మరో కొత్త మున్సిపాలిటీ ఏర్పడుతుందని ప్రభుత్వం భావించి ప్రకటన చేసింది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలు, సాంకేతిక అంశాలపై తాత్కాలిక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తున్నది. ఈమేరకు విలీన గ్రామాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆర్డీ, డీపీవో, టీపీఎస్‌కు ఆదేశాలు అందాయి. వచ్చే మున్సిపల్ ఎన్నికల నాటికి ప్రక్రియను పూర్తి చేయడం సహా డీపీఆర్ రూపొందించే బాధ్యత కన్సల్టెన్సీకి అప్పగించాలని కలెక్టర్ నిర్ణయించినట్లు తెలిసింది.

### తెరపైకి తొమ్మిది గ్రామాల విలీన ప్రతిపాదన

జనగామ మున్సిపల్‌కి మూడు కిలోమీటర్ల పరిధిలోని తొమ్మిది గ్రామ పంచాయతీల విలీనం చేయాలనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది. దీంతో సమీపంలోని నెల్లుట్ల, చీటకోడూరు, శామీర్‌పేట, యశ్వంతాపూర్, పెంబర్తి, ఎల్లంల, నాగారం, పసరుమడ్ల, వడ్లకొండ గ్రామాల విలీనానికి అవకాశం ఉంటుంది. విలీన ప్రతిపాదనతో 98,661 నుంచి జనాభా సుమారు లక్ష దాటి చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం పెరిగి గ్రేడ్-1 మున్సిపాలిటీగా విస్తరిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# ప్రశ్నిస్తే కేసులు, అరెస్టులా?

- కాంగ్రెస్ పాలనలో స్కీంలు లేవు.. అన్నీ స్కాములే
- సీఎం రేవంత్‌వి ప్రజావ్యతిరేక విధానాలు
- లగచర్ల ఘటనకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత
- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం

హనుమకొండ, నవంబర్ 15: కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం లేదు.. కొత్త స్కీములు లేవు.. అన్నీ స్కాములే.. సమస్యలపై ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరించడమే గాక అక్రమంగా కేసులు.. అరెస్టులు చేస్తున్నారని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు 11నెలల పాలనలో హామీలను విస్మరించిందని, అభివృద్ధి లేకపోగా తెలంగాణ ఆగమైందన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వమని చెప్పిన రైతులపై అక్రమంగా సర్కారు కేసులు బనాయించి జైలుకు పంపిందన్నారు. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని, ప్రతీకార పాలనగా మారిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం అని ఇండ్లు కూల్చివేస్తూ.. రైతురాజ్యం అంటూ రైతులను అరెస్టు చేస్తూ, ప్రజల పక్షాన పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ మరోసారి ఎమర్జెన్సీ రోజులను గుర్తు తెస్తున్నారని వివరించారు. హైడ్రా పేరుతో కూల్చివేతలు, మూసి ప్రక్షాళన పేరుతో లక్షన్నర కోట్ల సంపద లూటీకి ప్రణాళికలు.. సీఎం రేవంత్ రెడ్డి తన నియోజకవర్గం లగచర్ల రైతుల భూమిని కబ్జా చేయాలని చూస్తుంటే కడుపుమండిన వారు తిరగబడ్డారని అన్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోల్లు లేవు... పత్తి రైతు పంట కొనుగోలు జరగదు.. రైతుబంధుకు రాంరాం.. రుణమాఫీ సగం సగం.. ధాన్యానికి బోనస్ బోగస్‌గా మారిందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల ప్రాంతంలో ఫార్మాసిటీకి 14 వేల ఎకరాలు సేకరించారని, ఇప్పటికే 350 కంపెనీలు ఫార్మా పరిశ్రమలు స్థాపించేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రజల అభిప్రాయాలను సేకరించి, ప్రజలను ఒప్పించి సమకూర్చి పెట్టారన్నారు. దానిని పక్కన పెట్టడం వెనక రేవంత్‌రెడ్డి అంతర్యమేమిటని వినయ్‌భాస్కర్ ప్రశ్నించారు. లగచర్ల ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనలో మొత్తం 55మందిని అదుపులోకి తీసుకొని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలను వదిలేశారని, బీఆర్‌ఎస్ కార్యకర్తలను చిత్రహింసలకు గురిచేస్తున్నారని దాస్యం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై మంత్రి సీతక్క ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, నాయకులు నయీమొద్దీన్, బండి రజినికుమార్, ప్రణయ్, రఘు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణలో నిబంధనలకు పాతర

- ఇరువైపులా అమలు కాని ఒకే విధానం
- ములుగు జిల్లా కేంద్రంలో అధికారుల ఇష్టారాజ్యం
- నష్టపోతున్న ఇళ్ల యజమానులు


బండారుపల్లి రోడ్డుకు ఎడమ వైపున 45 ఫీట్లకు చేసిన మార్కింగ్

ములుగు, నవంబర్15(నమస్తేతెలంగాణ) : నిబంధనలు పాటించాల్సిన అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో పలువురి గృహాలకు నష్టం వాటిల్లుతున్నది. ఇందుకు నిదర్శనమే ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రోడ్డు విస్తరణ పనులను ఉదహరించవచ్చు. ప్రభుత్వ దవాఖాన ఎదురుగా ఉన్న బండారుపల్లి రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించేందుకు ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులతో ప్రణాళికలు రూపొందించింది. గత సెప్టెంబర్ 12న మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ జిల్లా కలెక్టర్‌తో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే అధికారులు రోడ్డు సెంటర్ లేన్ నుంచి రెండు వైపులా సమానంగా విస్తరించాల్సి ఉంది. అయితే పక్షపాత దోరణితో కుడి వైపు 40 ఫీట్ల మేరకు, ఎడమ వైపు 45 ఫీట్ల వరకు విస్తరింపచేసేలా మార్కింగ్ చేశారు. ములుగు నుంచి బండారుపల్లికి వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం నుంచి ప్రారంభించారు. మార్కింగ్ చేసినప్పుడే రెండు వైపులా సమానంగా చేపట్టకుండా తమ వైపు ఎక్కువ ఫీట్లు తీయడం ఏమిటని ఎడమ వైపున ఉన్న ఇండ్ల యజమానులు అభ్యంతరం తెలిపారు. అయితే అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వ భవనాలున్న వైపు 40 ఫీట్లు మాత్రమే విస్తరింపజేస్తామని చెప్పడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైసాపైసా కూడబెట్టుకొని కట్టుకున్న తమ భవనాలను 45 ఫీట్ల మార్కింగ్‌తో కూల్చివేయాల్సి వస్తున్నదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆస్తులకు ఓ న్యాయం, ప్రజల ఆస్తులకు మరో న్యాయమా అని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు ఒకేలా ఉండాలని కోరుతున్నారు.